# పారేసుకున్న బాల్యం



శ్రావణ్

వర్షం!

ఒకటే వాన... ధారాపాతంగా... గాలీ హోరూ కలగలసి... ఆ వర్షంలో స్కూటర్ డ్రయివ్ చేసుకుంటూ రైన్ కోటు ఉన్నా తడిసి ముద్దయి పోయి ఇంటికెలా వచ్చానో నాకే తెలీదు. స్కూటర్ లోపలికి తెచ్చి స్టాండ్ వేసి— హెల్మెట్ తీసే సరికి— ముఖానికి పూర్తిగా చమటలు పట్టేశాయి.

శ్రీమతి గబగబా తలుపులేసి రైన్‌కోటు విప్పకోడంలో సాయపడింది. తర్వాత చొక్కా తీశాను... బనీను మాత్రం వంటికి అంటుకుపోయింది.

చిన్నప్పుడు వానలో బట్టలుతడుపుకొస్తే అమ్మ చివాట్లేయడం గుర్తొచ్చింది...!

ఏం చిన్నతనం...?

తీయని కలలా... పేజీలు తిప్పేసిన పుస్తకంలా.. క్రమంగా దూరమైపోయిన మధురమైన పాటలా... బాల్యం... నా చిన్నతనం... ఆ చిన్నతనపు గుర్తులేవీ?

మస్తిష్కంలో తప్ప మరెక్కడా మిగల్లేదు... ప్స్...

శ్రీమతి టవల్ అందించింది.

తుడుచుకుని హాల్లో అడుగుపెట్టాను.

కుర్చీలో చేరగిలబడి కళ్ళు మూసుకున్నాను. మూసిన కళ్ళముందు ఏవో అస్పష్టమైన చీకటి వెలుగుల మిశ్రమాలు...!

నిశ్శబ్దం!

వర్షం హోరు తప్ప మరేం వినపడ్డంలేదు... కాస్సేపు రిలాక్స్‌గా వాలి! కను రెప్పలు మూయగానే మనిషికెంత విశ్రాంతి!... అదేం చిత్రమో! దాన్ని ఒకింత భంగపరుస్తూ... గాజుల గలగలతో కలిసిన కప్పు సాసర్ చప్పుడు.. ఎదురుగా శ్రీమతి... వేడి సెగల కాఫీ కప్పులో... ఆబగా అందుకున్నా...

రెండు మూడు సిప్పులు అయ్యాక— వెన్నులోంచి పుడుతున్న చలి తగ్గి... హూరట కలిగింది...

''ఎక్కడైనా కాస్సేపు ఆగి రాలేకపోయారా?'' అంది శ్రీమతి మామూలుగా. శ్రీమతుల రొటీన్ డైలాగ్... ఏమిటో ఆ మాత్రం బుర్ర బయటి కళ్ళే మగాళ్ళకి లేనట్టు....

''బయల్దేరాక.... మధ్యదారిలో ముత్తేసింది'' కప్పు ఇస్తూ అన్నా.... సిగరెట్ వెలిగించాను.

గుండెలనిండా పొగపీల్చి వదిలాను... వంట్లోకి కాస్త ఉషారు వేడి వచ్చినట్టయింది.

మళ్ళీ కాస్సేపుకళ్ళుమూసుకోవాలనిపించింది.

''ఒరేయ్ అబ్బాయ్! కళ్ళు తిరిగిపోతున్నాయి. నళ్ళు తిరిగిపోతోంది... కాస్త నా టాబ్లెట్లు పట్రారా నాయనా...'' అమ్మ అరుపులు.

ఏవో ప్రశాంతలోకాలలో విహరిస్తున్నవామీద—

హటాత్తుగా బండలు దొర్లించినట్లయింది.

అదిరిపడ్డాను! తమాయించుకుని ఈలోకంలోకి రావడానికి కొంచెం సేపు పట్టింది.

''ఒరేయ్! నాయనోయ్!... నా మాట వినిపించుకోవేమిట్రా!... చచ్చిపోతున్నారా నాయనా!...'' మళ్ళీ అమ్మగారి దీర్ఘాలు.... పెద్ద చిరాకేసిందా క్షణంలో...

వంటిమీద కొరడా ఝళిపించినట్టనిపించింది.

''అలాగే అమ్మా... తెస్తాను... గొడవ చెయ్యకు...'' విసుగు, కోపం, సాధ్యమైనంత అణచుకుని చెప్పాను.

''నాల్రోజుల్నుంచి చెప్తున్నాను... తెస్తానంటావు కాని తేవు... ఇంకా ఎప్పుడు తెస్తావు? నేనుచచ్చాకా?'' ముసలావిడ రెట్టించింది నాకెదురుగా సోఫాలో కూర్చుంటూ...

అంతే

నాకోపం కట్టలు తెంచుకుంది.

''ఆ... అలాగే అనుకో... నువ్వు చచ్చాకే తెస్తాను...నీ మందులన్నీ... అన్నట్టు చచ్చాక మందులవసరం ఉండదులే... నన్ను విసిగించకు.. వెళ్ళు...''

''కన్నతల్లికి మాత్రలు తేవడానికి కుదరదు... అడిగితే విసుగు... అడక్కపోతే పరాకు...ఆహా..హా ఏం కొడుకుల్ని కన్నాను?'' ముసలావిడ మరో విధంగా రెచ్చిపోతోంది.

''అమ్మా! ఏమిటా వెటకారాలు! అసలే ఆఫీసులో కొట్టుకుకొట్టుకుని వర్షంలో తడిసి ముద్దై చచ్చిచెడి ఇంటికొస్తే పది నిమిషాలు ప్రశాంతంగా ఉండనివ్వా? ఏమిటీ గొడవ?''

''అవున్లే... నేను మాట్లాడితే గొడవగానే ఉంటుంది...''

''నిజమే... నాకు వీలైనప్పుడు తెస్తాను.. లేకపోతే లేదు... నన్ను పదే పదే అడగొద్దు... నీకిష్టమైతే ఉండిక్కడ... లేకపోతే రాజిగాడి దగ్గర కెళ్ళిపో'' అనేసి విసురుగా నా గదిలోకెళ్ళిపోయాను.

క్షణం తర్వాత నా మాటలు నాకే అదోలా అనిపించాయి.

ఏమనుకుందో ఏమో మళ్ళీ రెండు రోజులు మా అమ్మ నాతో మాట్లాడలేదు. నన్నేమీ అడగలేదు.. అసలు పలకరించలేదు.

నేను కూడా ముభావంగా ఊరుకున్నాను.

ఆ తర్వాత నాకే అనిపించింది. ఆ మందులేవో తెచ్చి పడేస్తే పోలా అని.. గొడవేమిటంటే అన్నీ ఒక చోట దొరకవు. నాలుగుచోట్ల తిరగాలి.. అందుకు బద్ధకించేస్తున్నా.... ఏమైనా ఆ రోజు అమ్మ మందులు తేవడానికే నిశ్చయించుకున్నా...

ఆ సాయంత్రం మందులు కొనుక్కుని ఇంటికొచ్చేసరికి శ్రీమతి చెప్పిన వార్త విని నిశ్చేష్టుడినయ్యా...

ఆ మధ్యాహ్నమే అమ్మ విజయవాడ మా తమ్ముడింటికి వెళ్ళిపోయిందట!

* * *

అమ్మ విజయవాడ వెళ్ళిపోయి ఏడాది కావస్తోంది.

ఈ ఏడాదిలో ఎన్నో మార్పులొచ్చాయి మా ఇంట్లో..

అప్పుడప్పుడు మా తమ్ముడు రాసే క్షేమ సమాచారాలు తప్ప అమ్మగురించిన విశేషాలేవీ తెలియడంలేదు.

చెప్పొద్దూ.. తెలుసుకోవాలని నాకూ అనిపించలేదు!

కారణం నా ప్రపంచంలో నేనుండటం— మరి కాస్త బిజీగా ఉండడం.. దీనికి తోడు మా ఇంట్లో కొత్తగా వచ్చిన మరో ప్రాణి.

ఎవరో కాదు—

వాడే— నా కొడుకు...

వాడికి ఆరు నెలలు వస్తున్నాయి.

అచ్చు నా పోలికే అని అందరూ అన్నపుడు కాస్త గర్వంకలుగుతుంది. నా మటుక్కు నాకే అనిపించింది... వాడిలో నేనే కనిపిస్తున్నానని...

వాడిచిన్నతనంలో నా చిన్న తరహా...

నేను కూడా చిన్నప్పుడు వీడిలాగే ఉండేవాడినేమో!

''కరెక్ట్... ఇలాగే ఉండేవాడివి.. కాదు... కొంచెంతేడాలున్నాయి''

ఈ విషయం చెప్పేవారు?

ఎవరు? అవును.. ఎవరు చెప్పాలి?

ఇంకెవరు? నన్ను కనిపెంచిన అమ్మ.. ఆమే చెప్పాలి. ఈ ప్రపంచంలో ఆ విషయం నిర్ధారణ చేయ గల ఒకే ఒక వ్యక్తి మా అమ్మ... ఆవిడెలా చెబుతుంది?

"నా ఇంటికి రావడం లేదు... ఎక్కడో దూరాన ఉంది."

"మనవడు పుట్టాకైనా చూడ్డానికి రావొచ్చుగా!"

రాలేదు...

"దీనికి కూడా నేను ఆహ్వానించాలా?"

"సొంత కొడుకు ఇంటికి రావడానికి ఇన్విటేషన్ కావాలా?"

"మనవడిని వచ్చి చూడమని కొడుకు తల్లిని ఆహ్వానించాలా?"

"తల్లీకొడుకుల మధ్య కూడా ఫార్మాలిటీసా?!"

చెప్పొద్దూ— నాకూ కోపం వచ్చింది.


మా తమ్ముడికి ఆడపిల్లలేగాని కొడుకులు లేరు.

ఇన్నేళ్ళకి మా కుటుంబంలో వంశాంకురం!

పోనీ నామీద కోపం వస్తే మనవడేం చేశాడూ!

పెద్దావిడ వచ్చి దీవించద్దూ!

దీనికి 'కూడా పిలుపులు కావాలా?



ఆ మాటే అన్నాను మా ఆవిడతో...

ఏ మూడ్లో ఉందోగాని— నామీద గయ్ మంది!

"అవునండీ.. ఎంత మీ అమ్మయితే మాత్రం మీరు పొమ్మని మొహం మీద అంటే బాధప డదూ! మళ్ళీ ఎలా వస్తుంది మీ ఇంటికి? ఆ మాత్రం ఆలోచనలేదా? మిమ్మల్ని ఎవరేనా పొమ్మంటే మళ్ళీ వాళ్ళింటికెళ్తారా మీరు? అలాగే ఆవిడాను.."

"అది కాదోయ్.. ఎంత మాటా మాటా అనుకున్నా మేం తల్లీ కొడుకులం కాకపోం కదా?"

"అయితే మాత్రం అడ్డాల్లో ఉన్నంతసేపే బిడ్డలు.. గడ్డాలొచ్చాక బిడ్డలు కారని మర్చిపోయా రా?"

"ఇవాళ నీకేం పూనింది? పట్టపగలు చుక్క లు పొడవడం అంటే ఇదేనేమో!... బహుపరాక్.. భార్యగారూ! అత్తను వెనకేసుకొచ్చిన కోడల్ని సృష్టిలో మొదటిసారి ఇక్కడే చూస్తున్నా..." నవ్వే శాను.. ఏం చెయ్యాలో తెలీక శ్రీమతి కూడా నవ్వేసింది.

"ఇంత మామూలు విషయం కూడా మీరు ఆలోచించలేదా?.. ఏదో పెద్దావిడ.. చాదస్తం కొద్దీ ఒకటికి రెండు సార్లు అడిగిందే అనుకోండి... దాని మీద మీరు పెద్ద రాద్ధాంతం చేయ్యాలా? అందుకే ఆవిడ మనస్సు విరిగి వెళ్ళిపోయింది..."

"ఆహా!.. ఏమి నా శ్రీమతి గారి మనస్తత్వ పరిశీలన? విశ్లేషణ?" చప్పట్లు చరిచాను.

"మీరు వెటకారాలాడితే నేనసలు మీతో మాట్లాడను..."

"సర్లే... ఆడను.. కూర్చో... నీకిన్ని తెలివి తేటలు ఎలా వచ్చాయా అని ఆలోచిస్తున్నా... అంతే"

"అదేమిటి? తెలివితేటలు ఏమన్నా పోస్టులో వచ్చే పార్శిలా ఏమిటి?!"

"అది కాదులే.. నువ్విపుడు ఇల్లాలిగా మరో మెట్టెక్కి తల్లివి అయ్యావుగా... అందుచేత మరో తల్లి విషయాన్ని తేలిగ్గా కనిపెట్టేశావు.. కరెక్టేనా"

"అదుగో మళ్ళీ పరాచికాలు..."


"కాదోయ్... ఇది నచ్చి నాస్తవం.."

"మీతో ఇంక వాదించదల్చుకోలేదు... వస్తా... పిల్లాడు ఏడుస్తున్నాడు..."

నిష్క్రమించింది శ్రీమతి.

నేను ఆలోచనల్లో పడ్డా...

సిగరెట్ పొగరింగుల్లా ఆలోచనలు... పెద్ద రింగు.. మరో చిన్న రింగు.. దాంట్లో మరో బుల్లి రింగు... అది క్రమంగా పెద్దదై గదినిండా అలుము కున్నాయి. నీటి మధ్యలో నా కొడుకు మొహం...




నా ముఖాన్ని వాడిముఖంలో వెతుక్కుంటూ నేను...

నా చిన్నతనం గుర్తొచ్చింది...!

కానీ నా చిన్నతనం ఫోటో ఒక్కటి లేదు...! ఉంటే ఈనాడు నాకీ తాపత్రయముండకపోను...! నా చిన్నప్పుడు ఫోటోలు తీయించనిమా నాన్నమీద భలేకోపం వచ్చింది. నా బాల్యం ఇది.. అపుడు నేనిలా ఉన్నా.. అని చెప్పకోడానికి గాని, చూపిం చుకోడానికి గాని రెండు మూడు ఫోటోలుంటే ఎంత బావుండును? నా పర్సనల్ ఫోటో ఆల్బమ్ మరింత సమగ్రంగా ఉండి ఉండేది. వివిధ దశల్లో.. వయస్సులలో తేడా, ముఖ కవళికల్లో మార్పు లు... మొత్తం చిన్నతనమంతా వీడియో ఫిల్ములా కళ్ళకు కట్టినట్టుండేది... కానీ ఏం లాభం! మా నాన్న నిర్లక్ష్యం వల్ల ఏమీ మిగల్లేదు... ఎప్పుడూ.. ఎక్కడా ఏ కెమెరాలోనూ ఇరుక్కోకుండా నా చిన్నతనం అంతా గడిచిపోయింది. ఇప్పుడు అను కుని ఏం ప్రయోజనంలేదు...

కానీ నా కొడుక్కి అలా చేయకూడదు... ప్రతి ఏటా వాడికి తప్పకుండా నాలుగయిదు ఫోటోలు తీయించాలి.. నీటిని ఆల్బంలో భద్రం చేయాలి... గట్టిగా తీర్మానించుకున్నా...

ఏ వ్యక్తీ బాల్యాన్ని పారేసుకోకూడదు.. గుండె అట్టడుగుపొరల్లో నిక్షిప్తం చేసుకోవాలి...

మరి నేను పారేసుకున్న బాల్యం...?

వెతుక్కోడానికి ఒక్కటే మార్గం... నా కొడు కు!

వాడి బాల్యంలో నా బాల్యాన్ని చూసుకుని సంతోషించాలి..!

ఇది చిన్న కోరిక...!

నామనసిలా చిన్నగా మొదలై విజృంభించడం మొదలెట్టింది.

అసలు వాడు నాలా ఉన్నాడా?

నా పోలికలున్నాయా?

ఉంటే ఏమేరకు? ఆలోచనల ప్రశ్నలు నన్ను నిలబడనీయలేదు...

తరిమేశాయి...

శ్రీమతికి చెప్పేసి! మర్నాడే విజయవాడ రైలెక్కేశాను... అమ్మకోసం...

* * *

రెండు రోజుల తర్వాత

మా అమ్మతో తిరిగొచ్చిన నన్ను చూసి మా శ్రీమతి చిన్నగా నవ్వింది తలుపు తీసి.. చంకలో ఉన్న నా కొడుకు చిక్కుడు గింజల్లాంటి కళ్ళతో చిత్రంగా చూస్తున్నాడు.. నన్ను చూసి చేతులు చాపుతున్నాడు...

అమ్మవంక చూశాను...

ఆమె దృష్టంతా వాడిమీదే.. చేతిలో పెట్టె ఎప్పుడు క్రిందపెట్టిందో తెలీదు— అమాంతం వాడినెత్తుకుని ముద్దులు కురిపించింది.

"ఒరేయ్! ఏమిటో అనుకున్నాను గానీ.. వీడంతా నీ పోలికేరోయ్! చిన్నప్పుడు అచ్చుగుద్ది నట్టు నువ్వూ ఇలాగే ఉండేవాడివి..."

ఎన్నో రోజులుగా...

నెలలుగా...

నాలో రగులుతున్న ప్రశ్నకు అమ్మ ఇన్స్టాంట్ జవాబు...!

హమ్మయ్య! నా కొడుకు చిన్నపుడు అచ్చం నేనున్నట్టే ఉన్నాట్ట! నా సందేహంతీరిపోయింది... ఇకమీదట వాడిలో నన్ను నేను చూసుకోవచ్చు.

ఆ ఊహే ఎంతో గమ్మత్తుగా, హాయిగా ఉంది నాకు. నా సూట్ కేసు, అమ్మ పెట్టెలోపల పెట్టాను.

బాబు అమ్మ భుజాలమీద తల వాల్చుకుని నిద్రకుపక్రమించాడు.

ఇపుడు నాకెంత తృప్తిగా ఉందంటే.. అసలేం చేయాలో తోచడం లేదు...